సాక్షి
జోగులాంబ గద్వాల

గురువారం ı 11 ı జనవరి ı 2024



..రాకపోకలు బంద్

కృష్ణా బ్రిడ్జి మరమ్మతులతో 17వ తేదీ నుంచి రాకపోకలు నిలిచిపోనున్నాయి.

వివరాలు 8లో ▸



రన్నరప్‌గా మహబూబ్‌నగర్

రాష్ట్రస్థాయి విద్యుత్ ఉద్యోగుల టోర్నీలో పాలమూరు రన్నరప్‌గా నిలిచింది.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.6/15.8

వాతావరణం

ఉదయం, రాత్రి వేళ చలి తీవ్రత అధికంగా ఉండటంతో పాటు మంచు కురుస్తుంది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



గద్వాల క్రైం: జిల్లా జడ్జి కె కుషను బుధవారం సాయంత్రం కలెక్టర్ బీఎం సంతోష్ కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. జిల్లా పరిధిలోని వివిధ కేసుల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై జడ్జిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

అలంపూర్: జిల్లా నూతన కలెక్టర్ బీఎం సంతోష్‌ను ఎమ్మెల్యే విజయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరితోపాటు జిల్లా మత్స్యశాఖ సంఘం అధ్యక్షుడు తెలుగు గోపాల్, నాయకులు పరమేశ్వర్ రెడ్డి, రఘు రెడ్డి ఉన్నారు.

నేటి నుంచి బీచుపల్లిలో అధ్యయనోత్సవాలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా ఈనెల 11వ తేదీ నుండి 14 వరకు అధ్యయనోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలలో భాగంగా 14న శ్రీ గోధా రంగనాథస్వామి కళ్యాణంను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఓపెన్ డిగ్రీ, పీజీలో ప్రవేశాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ, పీజీలో ప్రవేశాల కోసం ఈనెల 31వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందని కోఆర్డినేటర్ సత్యనారాయణ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.8,143

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు బుధవారం 1,219 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 8143, కనిష్టం రూ.3259, సరాసరి రూ. 5690 ధరలు పలికాయి. అలాగే, 6 క్వింటాళ్ల ఆముదం రాగా, గరిష్టం రూ. 5389, కనిష్టం రూ. 5111, సరాసరి రూ. 5111 ధరలు వచ్చాయి. 14 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం 2926, కనిష్టం 2029, సరాసరి ధర రూ. 2361 ధరలు వచ్చాయి. 98 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ.8826, కనిష్టం రూ. 4626 ధరలు పలికాయి.

కందులు క్వింటాల్ రూ.9,160

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం కందులకు క్వింటాలు గరిష్టంగా రూ.9,160, కనిష్టంగా రూ.8,821 ధర లభించింది. వేరుశనగ క్వింటాల్ గరిష్టంగా రూ. 8,109, కనిష్టంగా రూ.5,869, పత్తి గరిష్టంగా రూ.6,389, కనిష్టంగా రూ.3,579, జొన్నలు రూ.1,851, ఆముదాలు రూ.5,270, ఆర్ఎన్ఆర్ రకం ధాన్యానికి క్వింటాలు గరిష్టంగా రూ.2,711 , కనిష్టంగా రూ.2,569, హంస రకానికి గరిష్టంగా రూ.1,958, కనిష్టంగా రూ.1,881, మొక్కజొన్నకు రూ.2,287, ఉలువలు రూ.5,952 ధరలు లభించాయి.

108 ఈఎంఆర్‌ఐలో ఉద్యోగ అవకాశాలు

పాలమూరు/జడ్చర్ల: ఈఎంఆర్ 108 సంస్థలో అత్యవసర మెడికల్ టెక్నీషియన్ ఖాళీల భర్తీ కోసం ఈనెల 12న జడ్చర్ల 108కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు 108 ప్రోగ్రామ్ మేనేజర్ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక అయిన అభ్యర్థులు మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు హైదరాబాద్‌లో అత్యవసర మెడికల్ టెక్నీషియన్ పని చేయాల్సి ఉంటుందన్నారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం,ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ పూర్తి చేసి ఉండి 30 ఏళ్ల లోపు ఉన్న అర్హులని, వివరాలకు 9581517828 సంప్రదించాలని సూచించారు.

కబ్జాలపై చర్యలేవి..?

అధికారం అండగా కబ్జాలకు తెరలేపిన కొందరు ఉద్యోగులు, నాయకులు

- ప్రభుత్వ స్థలం కబ్జా చేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- రిటైర్ ఉద్యోగి పది శాతం స్థలంలో యథేచ్ఛగా ఇంటి నిర్మాణం
- నిషేధిత వక్ఫ్ స్థలంలో చకచకా కట్టడాలు
- అక్రమ నిర్మాణాలపై కన్నెత్తి చూడని ఉన్నతాధికారులు
- కొత్త కలెక్టర్ అయిన స్పందించేనా..?

గద్వాల రూరల్:

జిల్లా కేంద్రంగా గద్వాల మారిన తర్వాత పట్టణం శరవేగంగా విస్తరించడమేగాకుండా వ్యాపార పరంగానూ ఎంతో అభివృద్ధి చెందింది. దీంతో జిల్లా కేంద్రంలోని భూముల విలువలు ఆకాశానంటుతున్నాయి. ప్రభుత్వ విలువ ప్రకారమే పట్టణ పరిధిలో 250 గజాల ప్లాటు ధర రూ.కోటి పలుకుతుందంటే ఇక్కడి భూముల ధరలు ఏస్థాయిలో ఉన్నాయో స్పష్టమవుతుంది. ఇంతటి విలువైన భూములను రాజకీయ పలుకుబడితో ఇప్పటికే చాలా మంది కబ్జాపెట్టి స్వాధీనం చేసుకోగా, మరోవైపు మేమేం తక్కువ అన్నట్లు కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు సైతం అక్రమార్కుల అవతారమెత్తుతున్నారు. తమకు మద్దతుగా రాజకీయ నాయకులకు అమ్యామ్యాలు ఇచ్చి కోట్ల విలువైన స్థలాలను దర్జాగా కబ్జా పెట్టి షాపింగ్ కాంప్లెక్స్, డూప్లెక్స్ ఇళ్లను నిర్మించుకుంటున్నారు. మరోవైపు నిషేధిత జాబితాలో ఉన్న వక్ఫ్‌స్థలాలలో సైతం అక్రమంగా నిర్మాణాలు చోటుచేసుకుంటున్నాయి. జిల్లా కేంద్రంలో ఐఏఎస్ స్థాయి అధికారి ఉంటున్నప్పటికీ చర్యలు తీసుకోవడంలో మాత్రం వెనకంజ వేయడం అందరినీ విస్మయానికి గురిచేస్తుంది. కొత్త కలెక్టరైన ఈ అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ గద్వాల పట్టణం బీరెల్లి చౌరస్తాలోని పదిశాతం స్థలం. మల్దకల్ మండలం పరిధిలో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి సుమారు రూ.2కోట్లు విలువైన పదిశాతం మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసి దర్జాగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపడుతున్నాడు. తనకు పలుకుబడి గల నాయకుడి అండ ఉందంటూ బాహటంగానే చెప్పుకోవడం గమనార్హం. ఇదే ప్రాంతంలో గతంలో నిర్మాణం చేపడుతుండగా.. అడ్డుకుని అక్రమ నిర్మాణాన్ని తొలగించిన మున్సిపల్ అధికారులు ప్రధాన రోడ్డుపై ఇంత బాహటంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నా మిన్నకుండి పోవడంలో దాగున్న ఆంతర్యమేమిటో చెప్పకనే చెబుతుంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న డూప్లెక్స్ ఇంటినిర్మాణం కుంటవీధిలోని మున్సిపాలిటీకి చెందిన పదిశాతం స్థలం. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.కోట్లలోనే ఉంటుందని సమాచారం. ఇంతటి విలువైన స్థలాన్ని వైద్య ఆరోగ్యశాఖలో రిటైర్డ్ అయిన ఓ ఉద్యోగి (ప్రస్తుతం మున్సిపాలిటీలో నామినేటెడ్ సభ్యుడు) కబ్జా చేసి దర్జాగా డూప్లెక్స్ ఇంటినిర్మాణాన్ని చేపడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. సంబంధిత వార్డు కౌన్సిలర్ సైతం అప్పటి కలెక్టర్, ప్రస్తుత అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వీటిపై నోటీసులు ఇచ్చి హడావుడి చేసిన అధికారులు ఆ తర్వాత ఒక్కసారిగా మిన్నకుండి పోయారు. ఇక్కడ కూడా సదరు కబ్జాదారుడికి రాజకీయ పలుకుబడి అండగా నిలబడడం, మరోవైపు పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చి నోర్లు మూయించారనే బలమైన ఆరోపణలతో పాటు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిషేధిత స్థలంలో...

అంబేద్కర్ చౌరస్తాలో ఫైర్‌స్టేషన్ పక్కన రూ.కోట్లు విలువ చేసే వక్ఫ్‌స్థలం ఉంది. ఈ స్థలం ప్రస్తుతం నిషేధిత జాబితాలో ఉంది. అంటే ఇక్కడ ఎవరు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. ఇందుకు విరుద్ధంగా చేపడితే ఎలాంటి నోటీసులు లేకుండానే తక్షణమే అక్రమ నిర్మాణాలను తొలగించవచ్చని ప్రభుత్వ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. కానీ అక్రమార్కులకు ఇవేమి అడ్డురావడం లేదు. యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. తెలివిగా తప్పించుకుంటున్నారు. అదేవిధంగా పట్టణం నడిబొడ్డులో ఉన్న కృష్ణవేణి చౌరస్తాలో పీఏసీఎస్‌కు చెందిన రూ.కోట్లు విలువ చేసే స్థలాన్ని కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కబ్జాపెట్టారు. అక్రమంగా రికార్డులు తారుమారు చేసి కొట్టేసెందుకు సిద్ధదయ్యారు. ఈ అక్రమాలపై గతంలో 'సాక్షి' వెలుగులోకి తీసుకురాగా, మరోవైపు ఈ స్థలం పీఏసీఎస్‌కు చెందినదని రెవెన్యూ కలెక్టర్ కోర్టులో తీర్పు వచ్చింది. అయితే అక్రమార్కులు మాత్రం ప్రభుత్వ నిబంధనలలోని లొసుగులను ఆసరాగా చేసుకుని సివిల్ కోర్టుకు వెళ్లారు. అదేవిధంగా ప్రభుత్వం స్థలాన్ని స్వాధీనం చేసుకోకుండా తమకున్న రాజకీయ పలుకుబడితో అడ్డుకట్ట వేశారనే విమర్శలు ఉన్నాయి.

రహదారిని సైతం వదలక..

అదేవిధంగా కొత్త హౌసింగ్ బోర్డు కాలనీలో విలువైన పదిశాతం స్థలాన్ని రాజకీయ పలుకుబడి నేత కబ్జాపెట్టి స్వాధీనం చేసుకున్నారు. ఇదే స్థలంలో ప్రజలు ఆ కాలనీకి వెళ్లేందుకు రహదారి సైతం ఉంది. రహదారిని సైతం కబ్జాపెట్టి దౌర్జన్యానికి పాల్పడినా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

విచారించి చర్యలు చేపడతాం



గద్వాల పట్టణంలో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురైతే వాటిపై పరిశీలించి విచారణ చేపడతాం. విచారణలో అక్రమాలు జరిగినట్లు తేలితే తప్పకుండా బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. గతంలో జరిగిన కబ్జాలపై పూర్తి ఆధారాలు నాకు అందిస్తే విచారణకు వీలుపడుతుంది.

– బీఎం. సంతోష్, కలెక్టర్

నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రితిరాజ్

గద్వాల క్రైం: నిషేధిత మత్తు పదార్థాలైన గంజాయి, గుట్కా, పాన్ మాసాలా, జర్దా తదితర వాటిని విక్రయించినా.. తరలించినా చర్యలు తీసుకోవాల్సిందిగా ఎస్పీ రితిరాజ్ స్పష్టం చేశారు. బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు అంశాలపై మాట్లాడారు. జిల్లాలో చెక్ పోస్టులు, సరిహద్దు ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా ఉంచి అనుమతి లేని మత్తు పదార్థాలను కట్టడి చేయాలన్నారు. ఎన్‌డీపీసీ యాక్టు కింద కేసులు నమోదు చేసి నిందితులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. మత్తు పదార్థాల క్రయ విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా పరిధిలోని నమోదైన కేసుల పరిష్కరం దిశగా విచారణ చేపట్టి నిందితులకు శిక్ష పడేలా కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. సివిల్ తగదాలపై జోక్యం తగదన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు.

బాలల హక్కులపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న సీడీపీఓ కమలాదేవి

అయిజ: బాలల హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ కమలాదేవి అన్నారు. బుధవారం మండలంలోని బింగుదొడ్డి ప్రభుత్వ పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ వారు విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడారు. బాల్యం పిల్లల హక్కు అని, వారందరూ స్వేచ్ఛాయుత వాతావారణంలో పెరగాలని అన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణ కలిగి ఉండాలని, శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకొని పేరు ప్రఖ్యాతులు గడించాలని, గురువులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చిపెట్టాలని కోరారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను అరికట్టాలని అన్నారు. బాలికలపై శారీరక, మానసిక, లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వేధింపులకు గురిచేసిన వారిపై 1098 లేదా 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ కౌన్సిలర్ సురేష్, ఓఆర్‌డబ్ల్యూ ప్రకాష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తెల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలి



ఆదిశిలా క్షేత్రంలో భక్తులకు ప్రవచనాలు వినిపిస్తున్న త్రిదండి దేవనాథ జీయర్‌స్వామి

మల్దకల్: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలందరు భక్తి మార్గంలో నడుచుకోవాలని త్రిదండి దేవనాథ జీయర్ స్వామి అన్నారు. బుధవారం ఆదిశిలా క్షేత్రానికి చేరుకున్న ఆయనకు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యశ్చంద్రారెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన కళ్యాణ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు వినిపించారు. ప్రజల మధ్య ఉన్న అసమానతలను తొలగించడానికి సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని, ప్రజలలో దైవ భక్తిని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. ముఖ్యంగా మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలందరూ సన్మార్గంలో నడుచుకోవాలని భక్తులకు వివరించారు. ఇంట్లో ఉన్న దేవుడు ఇంటిల్లిపాదికి కుటుంబ క్షేమం చూస్తే, ఆలయంలో ఉన్న దేవుడు లోకాన్ని సంరక్షిస్తాడన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, తిమ్మారెడ్డి, పెద్దవీరన్న, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నరేందర్, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం దరఖాస్తుల నమోదు




మాట్లాడుతున్న కమిషనర్ నర్సయ్య

అలంపూర్: ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల నమోదు వంద శాతం పూర్తి అయ్యిందని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలకు సంబంధించి ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని, అలంపూర్ మున్సిపాలిటిలోని 10 వార్డుల నుంచి 3,499 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అన్నీ రఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే వంద శాతం పూర్తి చేసిన తొలి మున్సిపాలిటీగా గుర్తించినట్లు తెలిపారు. వంద శాతం నమోదు ప్రక్రియ పూర్తి చేయడంతో ఆర్‌డీఎంఏ అభినందించినట్లు తెలిపారు. అందుకు సహకరించిన మున్సిపల్ సిబ్బందిని కమిషనర్ అభినందలు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు అహ్మద్ షరీఫ్, నారయణ, మద్దిలేటి, వార్డు అధికారులు ఆంజనేయులు, రహమతుల్లా, షేక్షావలి, కృష్ణ, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

- గద్వాల ఇన్‌చార్జి ఏడీఏ వెంకటలక్ష్మి

మల్దకల్: ఫర్టిలైజర్ షాపు యజమానులు రైతుకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని గద్వాల ఇన్‌చార్జి ఏడీఏ వెంకటలక్ష్మి ఫర్టిలైజర్ నిర్వాహకులను హెచ్చరించారు. బుధవారం మల్దకల్‌లోని ఆరు ఫర్టిలైజర్ షాపులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్స్ ఉన్నవారే రైతులకు ఎరువులు, విత్తనాలను విక్రయించాలని ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులకు సూచించారు. విత్తనాలు, ఎరువులు కొన్న రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు. ఫర్టిలైజర్ షాపులలో ఈ పాస్ మెషిన్ ద్వారానే పంపిణీ కార్యక్రమం చేపట్టాలని, స్టాక్ వివరాలను రికార్డులలో పొందుపరచాలన్నారు. అనుమతి లేని ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజశేఖర్, ఏఈఓలు పాల్గొన్నారు.



ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న వెంకటలక్ష్మి

ఆన్‌లైన్ నమోదు వేగవంతం

కోస్గి: ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి సేకరించిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని.. ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ సూచించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. మున్సిపల్ పరిధిలో వచ్చిన మొత్తం దరఖాస్తులు, ఆన్‌లైన్ నమోదుకు చేపట్టిన చర్యలను కమీషనర్ శశిధర్‌ను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ పరిధిలోని 16 వార్డుల్లో మొత్తం 6190 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటి వరకు 5860 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేశామని కమిషనర్ తెలిపారు. మిగిలిన దరఖాస్తులకు సంబంధించి త్వరితగతిన నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ సూచించారు. ఇందులో మున్సిపల్ మేనేజర్ శంకర్ నాయక్, వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది, ఆపరేటర్లు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్

ఆధునిక రైతు వేదికలు



మల్దకల్ రైతు వేదిక

- వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులతో అన్నదాతల ముఖాముఖి
- దృశ్య, శ్రవణ ద్వారా సలహాలు, సూచనలు
- పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాకు ఒక్కో రైతు వేదిక ఎంపిక
- ఒక్కో వేదికకు రూ.3.75లక్షల చొప్పున కేటాయింపు

కల్వకుర్తి: రైతులు మూస పద్ధతిలో పంటల సాగు చేపట్టి వ్యాపారుల సూచనలు పాటిస్తూ నష్టపోతున్నారు. వారికి తగిన సలహాలు, సూచనలు అందిస్తే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. గత ప్రభుత్వం రైతుల కోసం రైతువేదికలు నిర్మించింది. వీటిని ప్రయోజనకరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ విషయమై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి మొదటి సమీక్షలోనే చర్చించారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులు రైతులతో ముఖాముఖిగా సలహాలు, సూచనలు అందిస్తే బాగుంటుందని నిర్ణయించి అందుకు అనుగుణంగా ముందుకు సాగుతున్నారు. అంతేగాకుండా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల గురించి వివరించేందుకు వీలుగా రైతువేదికలను వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా తీర్చిదిద్దడానికి కసరత్తు చేస్తోంది. పైలెట్ ప్రాజెక్టుగా నియోజకవర్గానికి ఒక రైతువేదికను ఎంపిక చేసి జాబితాలు, ప్రతిపాదనలు రూపొందించారు. ఇందులో జిల్లాకు ఒకటి చొప్పున ఎంపిక చేసి.. సంకాంత్రి రోజున రాష్ట్రంలో మొత్తం 32 రైతువేదికల్లో ఏర్పాట్లు పూర్తిచేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి (వంగూరు మండలం)తో పాటు మహబూబ్‌నగర్ జిల్లాలో అడ్డాకుల, నారాయణపేట జిల్లాలో మాగనూరు, జోగుళాంబ గద్వాల జిల్లాలో మల్దకల్, వనపర్తి జిల్లాలో పాన్‌గల్ రైతు వేదికలున్నాయి.

పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైన రైతు వేదికలు	
జిల్లా	రైతు వేదిక
నాగర్‌కర్నూల్	కొండారెడ్డిపల్లి
వనపర్తి	పాన్‌గల్
మహబూబ్‌నగర్	అడ్డాకుల
నారాయణపేట	మాగనూరు
జోగుళాంబ గద్వాల	మల్దకల్

❒ పైలెట్ ప్రాజెక్టుగా రైతువేదికల్లో రైతులకు వ్యవసాయ, ఉద్యాన, పట్టు, మల్బరీ, మత్స్య, పశుసంవర్ధక, విద్యుత్, నీటిపారుదలశాఖలకు సంబంధించిన అన్ని పథకాల సమాచారం అందించనున్నారు. వీటి ద్వారా ఎంత మేర ప్రయోజనం చేకూరుతుందో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి ఉత్తమ ఫలితాలు వస్తున్నాయంటే అన్ని నియోజకవర్గాల్లోని రైతువేదికల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

సీఎం స్వగ్రామంలో ప్రారంభం..



నాగర్‌కర్నూల్ జిల్లాలో మొదట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి రైతువేదికను వీడియో కాన్ఫరెన్స్ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం. సామగ్రి ఒకటి, రెండురోజుల్లో వస్తుంది. సంక్రాంతి రోజున సీఎం, వ్యవసాయశాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో మాట్లాడి ప్రారంభిస్తారు. ఆ రోజు 200 మంది రైతులు పాల్గొననున్నారు. మిగతా కేంద్రాల్లో సైతం త్వరలో ప్రారంభిస్తాం. వీటితో రైతులకు ఎంతో మేలు చేకూరనుంది.

– చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ డీఏఓ, నాగర్‌కర్నూల్

ఇంటర్‌నెట్ కనెక్షన్లపై సర్వే..

ఎంపిక చేసిన రైతువేదికలకు ఏయే ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులో ఉన్నాయో తెలుసుకునేందుకు బీఎస్ఎన్ఎల్, టీఎస్ ప్రభుత్వం నెట్‌వర్క్‌ల అధికారులు సర్వే చేపట్టారు. ఏ వ్యవస్థ అందుబాటులో ఉంటే వాటి సేవలు వినియోగించేలా ప్రణాళిక తయారు చేశారు. గతంలో రైతువేదికలతో రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. ఏఈఓలు మాత్రమే కార్యాలయాలుగా వినియోగించుకున్నారు. రైతువేదికల్లో 125 కుర్చీలు, రెండు టేబుళ్లు, ఒక మైక్‌సెట్ ఉన్నాయి. అన్ని అందుబాటులో ఉన్నందున వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా తీర్చిదిద్దితే అన్నిరకాలుగా ప్రయోజనకరంగా ఉంటుందని.. తద్వార వేదికల ఉద్దేశం నెరవేరుతుందని భావిస్తున్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


సామ్యనాయక్ (ఫైల్)

లింగాల: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందిన ఘటన మండలంలోని కొత్తచెర్వు తండాలో బుధవారం వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం మేరకు.. తండాకు చెందిన సామ్యనాయక్ (60) తన సొంత పొలంలో వేరుశనగ సాగు చేశాడు. అడవి పందుల నుంచి పంటను రక్షించుకోవడానికి విద్యుత్ కంచెను ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం రాత్రి పంటకు నీరందించేందుకు బోరుమోటారు ప్రారంభించి ఇంటికి వచ్చాడు. బుధవారం తెల్లవారుజామున మోటారు బంద్ చేయడానికి పొలానికి వెళ్లగా కంచెకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ కాలికి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సామ్యనాయక్ ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లగా మృతిచెంది కనిపించాడు. సామ్యానాయక్‌కు భార్య పొండమ్మ, ఇద్దరు సంతానం ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీనివాసులు వివరించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


శివలీల(ఫైల్)

డిండి: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతిచెందింది. నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శివలీల(28)తో డిండి పట్టణానికి చెందిన తోకల దేవేందర్‌కు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఆరేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనారోగ్య కారణాలతో దేవేందర్ నాలుగు నెలల క్రితం మృతిచెందగా శివలీల కులవృత్తి (మేదరి పని) చేసుకుంటూ అత్తామామతో కలిసి ఉంటోంది. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున శివలీల ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. కిటికీలోంచి గమనించిన దేవేందర్ తండ్రి జంగయ్య చుట్టు పక్కల వారిని పిలిచి తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే ఆమె మృతిచెందింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ. సైదులు తెలిపారు. కాగా, తల్లిదండ్రులు చనిపోవడంతో రోదిస్తున్న ఇద్దరు చిన్నారులను చూసి పలువురు కంటతడి పెట్టుకున్నారు.

టైర్ పగిలి ముగ్గురికి గాయాలు



కొత్తకోట రూరల్: శబరిమలకు వెళ్తున్న భక్తుల వాహనం టైర్ పగిలి రోడ్డు పక్కన ఉన్న లారీ ఢీకొన్న ఘటన బుధవారం సాయంత్రం వనపర్తి జిల్లా కొత్తకోట మండలం అమడబాకుల సమీపంలో ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి శబరిమలకు 16మంది భక్తులు మినీ ట్రావెల్స్‌లో బయలుదేరారు. కొత్తకోట సమీపంలోకి రాగానే టైర్ పగిలిపోవడంతో పక్కనే ఆగివున్న లారీ ఢీకొనగా ట్రావెల్స్ డ్రైవర్ అజయ్‌తో పాటు పెంటన్న, సురేష్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం విషయం తెలుసని, ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

టీవీలు దొంగిలించిన ఇద్దరికి రిమాండ్

నాగర్‌కర్నూల్ క్రైం: ఎల్‌ఈడీ టీవీలను దొంగిలించిన ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన సమాచారం మేరకు.. అచ్చంపేట మండలంలోని మన్నెవారిపల్లికి చెందిన సైదులు, వెంకటేష్ ఓ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టులో 2 ఎల్‌ఈడీ టీవీలను దొంగలించారు. గమనించిన యజయాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరాలను పరిశీలించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరాన్ని అంగీకరించారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోక్సో కేసులో వ్యక్తి..

గోపాల్‌పేట: పోక్సో కేసులో పరారీలో ఉన్న వ్యక్తిని పట్టుకుని బుధవారం రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలానికి చెందిన ఓ బాలికతో ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. వారి కుటుంబ సభ్యులు ఈనెల 5వ తేదీన కేసు పెట్టారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నిందితుడి పట్టివేత

కోస్గి: మున్సిపల్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ఈ నెల 3న అదే గ్రామానికి చెందిన యువకుడు తీసుకెళ్లిన కేసులో పోలీసులు నిందితున్ని పట్టుకున్నారు. బుధవారం బాలికతోపాటు యువకుడిని అదుపులోకి తీసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. విచారణ అనంతరం కేసు నమోదు చేసి యువకుడిని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

17 నుంచి రాకపోకలు బంద్

కృష్ణా బ్రిడ్జిపై 45 రోజుల పాటు మరమ్మతులు

- రాయచూరు నుంచి గద్వాల మీదుగా దారి మళ్లింపు
- మూడుసార్లు మరమ్మతు చేసినా ఫలితం శూన్యం
- మళ్లీ మరమ్మతులకు ఎన్‌హెచ్ అధికారుల శ్రీకారం


నిజాం కాలం నాటి కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ కృష్ణానదిపై నిర్మించిన బ్రిడ్జి

కృష్ణా: మండల సరిహద్దులోని కృష్ణానదిపై నిజాం కాలంలో నిర్మించిన బ్రిడ్జికి ఎన్‌హెచ్ అధికారులు మరమ్మతులు చేసేందుకు ఈ నెల 17వ తేదీన ఉదయం 5 గంటల నుంచి వాహనాల రాకపోకలను నిలిపి వేస్తున్నట్లు రాయచూర్ కలెక్టర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అందుకు గాను రాయచూర్ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను గద్వాల్ మీదుగా వెళ్లాలని, ఇటు వైపు కూడా జూరాల బ్రిడ్జిపై వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు.

బ్రిడ్జిపై అడుగుకో గుంత

కర్ణాటక ప్రభుత్వం 2016లో ఈ బ్రిడ్జిపై కొత్తగా సీసీ రోడ్డు వేసినా ప్రయాణికులకు ఉపయోగం లేకుండాపోయింది. వేసిన సీసీకి బేరింగ్‌లు ఎక్కడికక్కడ లేచిపోవడంతో వాటి మూలంగా ప్రతి రోజు రాత్రి వేళ్లలో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అడుగడుగునా గుంతలు పడడంతో ప్రతినిత్యం వాహనదారులు ఎక్కడో ఒక చోట ఈ బ్రిడ్జిపై ప్రమాదాల పాలవుతున్నారు. ఈ గుంతలు ఎంత ప్రమాదకరంగా ఉన్నాయంటే వాహనాలు ఇరుక్కుంటే పైకి వచ్చే అవకాశం లేకుండా ఉంది. పెద్ద వాహనాలను ఈ బ్రిడ్జిపై గుంతలో ఇరుక్కుంటే ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయి కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్‌జాం ఏర్పడుతుంది. ఈ సమయంలో అటు కర్ణాటక పోలీసులు, ఇటు తెలంగాణ పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు తలకు మించిన భారంగా మారుతుంది. ఈ విషయంపై అప్పట్లో పలుమార్లు అధికారులకు విన్నవించడంతో స్పందించిన అధికారులు 2023 ఫిబ్రవరిలో మరోమారు బ్రిడ్జి మరమ్మతులు చేయించారు. అయినా మళ్లీ అదే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ బ్రిడ్జి మరమ్మతు ఎలా చేయాలో అంతుచిక్కకుండా పోయింది. పాత రోడ్డు ఉన్నప్పుడే బాగుండేదని, కొత్తగా సీసీ వేసినప్పటి నుంచి సమస్య జటిలమైందని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇప్పుడు ఏకంగా 45 రోజులు బ్రిడ్జిపై వాహనాలను నిలిపి వేసి మళ్లీ మొదటి లాగే మరమ్మతులు చేస్తే ప్రజాధనం, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవని అంటున్నారు. కాంట్రాక్టర్లు నాణ్యతగా చేయకపోతే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


బ్రిడ్జిపై ట్రాఫిక్ జాం

నిజాం కాలం నాటి బ్రిడ్జి

హైదరాబాద్ నిజాం నవాబు పరిపాలన సమయంలో కృష్ణానదిపై కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు మెరుపరిచేందుకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఆ సమయంలో రూ.13,28,500 వెచ్చించారు. ఈ బ్రిడ్జినిర్మాణం 1933లో ప్రారంభమై 1943లో ముగిసింది. నదిపై 2,488 ఫీట్ల పొడవు, 20 ఫీట్ల వెడల్పురోడ్‌తో, నదిపై నుంచి 62ఫీట్ల ఎత్తులో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారు. మహ్మద్ హమీద్ మిర్జా చీఫ్ ఇంజినీర్‌గా, సబ్బీర్ యూసూఫ్, ఫారాతుల్లా ఇంజినీర్లుగా, కాంట్రాక్టర్‌గా బాల్‌రాం వ్యవహరించారు.

కొత్త బ్రిడ్జిని నిర్మించాలి..



ప్రస్తుతం ఉన్న బ్రిడ్జిపై ప్రయాణాలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. కేవలం 20 ఫీట్ల వెడల్పు ఉండడం మూలంగా పెద్ద వాహనాలు వచ్చిన సమయంలో వెళ్లలేకపోతున్నాయి. అందుకు కొత్తగా మరో బ్రిడ్జిని నిర్మిస్తే ప్రయాణికులకు మేలు కలుగుతుంది. బ్రిడ్జిపై రోడ్డు ఇరుకుగా ఉండడం మూలంగా తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

– అంజనమ్మ పాటిల్, జెడ్పీటీసీ సభ్యురాలు, కృష్ణా మండలం

ఫ్లైఓవర్ కోసం డిమాండ్

- 167వ నంబర్ హైవేపై శంకరాయపల్లి తండా గేట్‌వద్ద తరుచూ ప్రమాదాలు

జడ్చర్ల టౌన్: 167వ నంబర్ జాతీయరహదారిపై జడ్చర్ల–మహబూబ్‌నగర్ రోడ్డుపై శంకరాయపల్లితండా గేట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలన్న డిమాండ్ పెరుగుతుంది. ఈ మార్గంలో నిత్యం ప్రమాదాలు అవుతుండడంతో వాటిని అరికట్టేందుకు స్టాపర్లు ఏర్పాటు చేసినా ఫలితం లేకుండాపోయింది. జాతీయరహదారి నుంచి శంకరాయపల్లితండా, మాటుబండతండా మరో 4తండాలు, శంకరాయపల్లితో పాటు క్రషర్‌మిషన్, కాటన్‌మిల్, బండమీదిపల్లి, వల్లూరు, పెద్దపల్లి, ఉదండాపూర్ వెళ్లేందుకు మార్గం ఉంది. ఇటీవల ఉదండాపూర్ ప్రాజెక్ట్ పనులు చేస్తుండడంతో భారీ వాహనాలు ఇదే మార్గంలో వెళ్తున్నాయి. భవిష్యత్‌లో రిజర్వాయర్ పూర్తయ్యాక మహబూబ్‌నగర్ వైపు నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఇదేమార్గం ద్వారా చేరుకుంటారు. ఈ కారణంగా వాహనాల రాకపోకలు పెరిగే ఆస్కారం ఉంది. జాతీయ రహదారి నుంచి శంకరాయపల్లి తండా రోడ్‌కు మళ్లేందుకు వాహనాలు ప్రయత్నిస్తున్న సమయంలో భారీ ప్రమాదాలు అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ మార్గంలో ఆరుగురు మృత్యువాతపడ్డారు. జాతీయరహదారి నిర్మాణ సమయంలోనే ఫ్లైఓవర్ ప్రతిపాదించి ఉంటే సమస్య ఉత్పన్నమయ్యేది కాదు. ఈ ప్రాంతంలో రోడ్డు ఎత్తులో ఉండటం, ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవు.


ప్రమాదకరంగా మారిన వంకరాయపల్లి తండా గేట్

ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే అని రుద్‌రెడ్డి మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు ఫ్లైఓవర్ నిర్మించాలని వినతిపత్రం సమర్పించారు. రోడ్డు వద్ద తండా కు, గ్రామాలకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్తున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఫ్లైఓవర్ నిర్మాణం చేయించాలని కోరారు.

అధికారులను కలిసి వివరిస్తా..

శంకరాయపల్లి తండాగేట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం కోసం జాతీయరహదారుల శాఖ అధికారులను కలిసి సమస్యను వివరిస్తానని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. గతంలో జాతీయ రహదారిపై ప్రభుత్వ అతిథిగృహం వద్ద బండమీదిపల్లి వాసులు మృతిచెందిన ఘటన గురించి అధికారులకు వివరించి ఫ్లైఓవర్ నిర్మాణం చేసేలా చూస్తానని పేర్కొన్నారు.

చెరువును పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..


పాతినివానికుంటను పరిశీలిస్తున్న అధికారులు

గండేడ్: 'చెరువుకు రక్షణ కరువు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని పోతులవారి చెరువును ఆక్రమించుకుని సాగు చేస్తున్న విషయం సాక్షి దినపత్రిక వెలుగులోకి తెచ్చింది. తహసీల్దార్ నాగలక్ష్మి, ఇరిగేషన్ డీఈ వెంకట్‌రాములు, ఏఈ మనోహర్, ఏఎస్‌ఐ ఆజాంఅలీ బుధవారం సంయుక్తంగా చెరువును సందర్శించారు. ఎక్కడెక్కడ ఆక్రమణకు గురైంది? ఎవరెవరూ ఇందులో ఉన్నారనే అంశాలపై అధికారులు ఆరా తీశారు. చెరువులో నుంచి బాట వేసుకున్న రైతులను తక్షణమే తీయాల్సిందిగా అధికారులు ఆదేశించారు. ఎవరైనా అక్రమంగా చెరువు ఆక్రమించుకుంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'వేరుశనగ కోతలో యాంత్రీకరణ చేపట్టాలి'


డిగ్గర్‌తో కోసిన పంటను చూపిస్తున్న ఏడీఆర్ మల్లారెడ్డి

బిజినేపల్లి: వ్యవసాయంలో కూలీల కొరత రానుండటంతో రైతులు యాంత్రీకరణ చేపట్టాలని, వేరుశనగ పంటకోతలో పీకడం పద్ధతికి స్వస్తి పలికి యాంత్రీకరణతో పంట కోత చేపట్టాలని పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ మల్లారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని అల్లీపూర్‌లో వేణుగోపాల్ అనే రైతు పొలంలో వేరుశనగ పంటలో డిగ్గర్‌పై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఏడీఆర్ డా.మల్లారెడ్డి మాట్లాడారు. వేరుశనగ పంట సాగులో అధిక పెట్టుబడి ఖర్చు కూలీల సాయంతో పీకడానికి అవుతుందని, దీనిని తగ్గించుకోవడానికి యంత్రాలు ఉపయోగించాలన్నారు. రాబోయే రోజుల్లో కూలీల కొరత కూడా ఎక్కువ ఉండటంతో రైతులు యాంత్రీకరణపై తమ దృష్టి మళ్లించాలన్నారు. వేరుశనగ కోత డిగ్గర్ యంత్రం ఏయే నేలల్లో ఎంత తేమలో సులభంగా పంట కోత చేపట్టగలదో ప్రదర్శనాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో పాలెం కేవీకే సమన్వయకర్త డా.ప్రభాకర్ రెడ్డి, శాస్త్రవేత్తలు రామిరెడ్డి, విజయలక్ష్మి, శ్రవంతి, రామకృష్ణ, ఏఓ నీతి, ఏఈఓ మధు రైతులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలలో కొర్ర ప్రధానం

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: చిరు ధాన్యపంటల్లో కొర్ర ప్రధానమైన పంట. కొర్రలలో పోషకాలతోపాటుగా ఔషధ గుణాలు పుష్కలంగా ఉంటాయి. వీటిలో పిండి పదార్థాలు తక్కువగా, పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఈ కారణంగా ఉబయకాయంతో బాధపడేవారికి మంచి ఆహారంగా గుర్తించారు. వీటిని ఆహారంలో భాగంగా (వరికి బదులు) తీసుకోవడం ద్వారా చక్కెర, గుండె జబ్బులను ఇతర రోగాలను అదుపులో ఉంచుకోవచ్చు. ప్రస్తుత తరుణంలో కొర్రకు మంచి డిమాండ్ వచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో కొర్ర పంట సాగు చేసుకోవడం రైతులకు లాభదాయకమని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు. కొర్ర సాగు, యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు.

సాగు

కొర్రను వానాకాలం పంటగా జూన్–జులై మాసాల్లో సాగు చేసుకోవచ్చు. అదే విధంగా రబీలో వేసవి పంటగా జనవరి మాసంలో సాగు చేసుకోనే అవకాశం రైతులకు ఉంటుంది.

రకాలు

కృష్ణదేవరాయ, నరసింహరాయ, శ్రీలక్ష్మి, ఎస్‌ఐఏ 3085 రకాలు 80 నుంచి 85 రోజుల్లో కోతకు వస్తాయి. అలాగే ప్రసాద్, సూర్యనంది (ఎస్‌ఐఏ3088) రకాలు 70 నుంచి 75 రోజుల్లో కోతకు రావడంతో పాటు అధిక దిగుబడి ఇస్తాయి.

విత్తన మోతాదు

సాళ్లలో విత్తితే ఎకరాకు 2కిలోలు, వెదజల్లే పద్ధతిలో అయితే 4కిలోల విత్తనం సరిపోతుంది.

- కిలో విత్తనానికి రెండు గ్రాముల కార్బండిజంతో విత్తన శుద్ధి చేయాలి.
- 25 సెం.మీ. ఎడం ఉన్న సాళ్లలో మొక్కల మధ్య 10 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి.
- అంతర్ పంటగా ప్రతి ఐదు సాళ్లకు ఒక సాలు కంది వేయాలి. లేదా 2:1 నిష్పత్తిలో కొర్ర వేరుశనగ వేయవచ్చు.
- విత్తిన రెండు వారాల్లోపు ఒత్తు మొలకలను తీసి వేయాలి.


కొర్ర పంట

- 30 రోజుల వరకు పంట పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూడాలి.
- విత్తిన 20 నుంచి 25 రోజుల తర్వాత సాళ్లల్లో అంతర్ కృషి చేసి కలుపు నివారించాలి.

ఎరువులు

ఆఖరి దుక్కిలో నాలుగు టన్నుల పశువుల ఎరువులను పొలంలో వేసి బాగా కలియదున్నాలి. విత్తేటప్పుడు 20 కేజీల యూరియా, బస్తా(50 కేజీల) సింగిల్ సూపర్ ఫాస్పేట్ వేయాలి. విత్తిన నెల రోజులకు మరో 20 కేజీల యూరియాను పైపాటుగా వేయాలి.

సస్యరక్షణ

- కొర్ర పంటను ఆశించే వాటిలో గులాబీ రంగు పురుగు, కాండం తొలిచే పురుగు, చెదలు, మిడతలు, లద్దె పురుగు ముఖ్యమైనవి.
- చెదల నివారణకు చివరి దుక్కిలో ఫాలిడాల్ రెండు శాతం పొడి మందును ఎకరాకు 10 నుంచి 12 కిలోల వంతున మట్టిలో బాగా కలిసేటట్లు వేయాలి.
- మిడతల నివారణకు కార్బరిల్ 5 శాతం పొడి మందును ఎకరాకు 10 నుంచి 12 కిలోల చొప్పున చల్లాలి.
- కిలో విత్తనానికి 3 గ్రాముల కాప్టాన్/థైరాం, మందుతో విత్తన శుద్ధి చేయడం ద్వారా తుప్పు, అగ్గి, వెర్రికంకి తెగుళ్లను కొంత వరకు అరికట్టవచ్చు.

సినిమా థియేటర్‌లో అగ్నిప్రమాదం

నాగర్‌కర్నూల్ క్రైం: మూతపడిన సినిమా థియేటర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. అగ్నిమాపకశాఖ అధికారి కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని నాగనూలు చౌరస్తాలోని మూతపడి ఉన్న రవీంద్రటాకీస్‌లో చాలా రోజులుగా చెత్త పేరుకుపోవడంతో మంటలు పెద్దఎత్తున వ్యాపించాయి. అగ్నిమాపక కేంద్రం నుంచి వచ్చిన ఫైర్ ఇంజన్ ద్వారా మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికి అదుపు కాలేదు. కల్వకుర్తి నుంచి మరో ఫైరింజన్‌ను తీసుకువచ్చి మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా? ఎవరైనా నిప్పంటించారా అనే విషయాలు సేకరిస్తున్నట్లు అగ్నిమాపకశాఖ అధికారి తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: ఏఐఆర్‌ఎఫ్, ఎస్‌సీఆర్‌ఎంయూ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆవరణలోని ఇంజినీరింగ్ కార్యాలయం ఎదుట మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నిరాహార దీక్ష చేపట్టారు. కార్యదర్శి జానకిరామయ్య, అధ్యక్షుడు లక్ష్మయ్య మాట్లాడుతూ రైల్వేలో కొత్త పెన్షన్ విధానాన్ని తొలగించి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీసం పెన్షన్ సౌకర్యం లేని కొత్త విధానంలో రైల్వే ఉద్యోగులు ఎంతో ఇబ్బందులు పడుతారని తెలిపారు. ఉద్యోగ విరమణ తర్వాత కొత్త పెన్షన్ వల్ల ఎంత వస్తుందో తెలియని పరిస్థితి ఉంటుందని, కుటుంబ పోషణ భారంగా మారుతందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్త పింఛన్ విధానాన్ని తీసివేయాలని కోరారు. దీక్షలో నారాయణ, యాదగిరి, నర్సింహ, మధు, కేశవులు, గోపాల్, ప్రవీణ్‌రెడ్డి, పరశురాం, కురుమూర్తిరెడ్డి, భగవంతు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పీయూ రిజిస్ట్రార్ గిరిజ పేర్కొన్నారు. ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో పర్యావరణంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. భావితరాల కోసం కచ్చితంగా పర్యావరణం, వనరులను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో రసాయణశాస్త్ర పాత్ర ఎంతో ఉందన్నారు. ప్రొఫెసర్ అశోక్ మాట్లాడుతూ పర్యావరణాన్ని శుభ్రం చేయకపోయినప్పటికీ దాన్ని మలీనం చేయకుండా ఉండాలని, వివిధ నగరాలు మానవ కార్యకలాపాల వల్ల అపరిశుభ్రంగా మారాయన్నారు. వ్యవస్థ ఎంతో మార్పులు చెందుతున్న పర్యావరణ ప్రయోగాలు ఇంకా పాతపద్ధతిలోనే కొనసాగుతున్నాయని తెలిపారు. పలువురు విద్యార్థులు పేపర్, పోస్టర్ ప్రదర్శన చేశారు. ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, నిరాశ్రయులను ఆదుకుంటాం


దుప్పట్లు కప్పుతున్న ఫోరం నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పేద వృద్ధులను, నిరాశ్రయులను ఆదుకుంటామని సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి నస్కంటి నాగభూషణం, బాలకృష్ణ, రాజసింహుడు అన్నారు. మహబూబ్‌నగర్‌లోని రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, ఫుట్‌పాత్‌లపై పడుకున్న వృద్ధులకు, నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కొన్నేళ్లుగా ప్రతి చలికాలంలో వృద్ధులు, నిరాశ్రయులు, యాచకులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే వారికి వైద్య సహాయంతో పాటు ఉచితంగా మందులు, దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తమ ఫోరం ద్వారా వచ్చిన ఫిర్యాదుల విషయంలో శిక్ష పడేలా చేయడం, తల్లిదండ్రులను పోషించకుండా ఇబ్బందులు పెడుతున్న వారి నుంచి ఆస్తులను తిరిగి స్వాధీన పరిచే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రూ.2.48 కోట్లు వసూలు

మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ ఈ–చలాన్‌పై రాయితీలకు సంబంధించి బుధవారం భారీగా వసూలయ్యాయి. తొలుత ప్రకటించిన విధంగా చివరిరోజు కావడంతో బుధవారం ఒక్కరోజే జిల్లా వ్యాప్తంగా 21,423 కేసులలో రూ.24,70,065న గదును వాహనదారులు ప్రభుత్వ ఖాతాలో జమ చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో 2,12,717 ఈ–చలాన్ కేసుల్లో రూ.2.48కోట్లు చెల్లించారు. దీంతో జిల్లాలో 40శాతం ఈ–చలాన్ కేసుల్లో పెండింగ్‌లో ఉన్న జరిమానాలు వసూలు కావడం విశేషం. అయితే పూర్తి స్థాయిలో పెండింగ్ ఈ–చలాన్ కేసులు వసూలు కాకపోవడంతో ప్రభుత్వం రాయితీల గడువు ఈ నెల 31వరకు పొడిగించింది. వాహనదారుల నుంచి జరిమానాలను రాబట్టడం కోసం పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టడంతో పాటు వాహనాలను తనిఖీ చేసి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వాటిని చెల్లించాలని అవగాహన కల్పిస్తున్నారు.

112 ఏళ్ల వృద్ధురాలు మృతి


శాంతమ్మ(ఫైల్)

అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్ చెందిన వృద్ధురాలు బోయ శాంతమ్మ(112) మృతి చెందింది. మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన ఈమె బుధవారం ఇంటి వద్దే మృతి చెందింది. ఆమె భర్త బోయ బాలకిష్టయ్య చాలా ఏళ్ల క్రితమే చనిపోయాడు. శాంతమ్మకు ఇద్దరు కుమారులు, ఏడుగురు కుమార్తెలు ఉన్నారు. మూడు రోజుల క్రితం వరకు శాంతమ్మ కర్ర సాయంతో నడిచేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఒకరిపై ఆధారపడకుండా తన పనులు తానే చేసుకునేదని చెప్పారు.

దిగొచ్చిన ఉల్లి ధర

- గరిష్టంగా రూ.2,100, కనిష్టంగా రూ.1,060

దేవరకద్ర: స్థానిక మార్కెట్‌లో బుధవారం నిర్వహించిన వేలంలో ఉల్లి ధరలు దిగి వచ్చాయి. రెండు వారాలుగా గరిష్ట ధరలు తగ్గుముఖం పట్టగా ఈ వారం మరింత తగ్గాయి. కనిష్ట ధరలు కొంత వరకు అటు ఇటుగా మారుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌కు కొత్త ఉల్లి వస్తుండంతో వ్యాపారం జోరుందుకుంది. తెల్లగా నాణ్యంగా ఉన్న ఉల్లికి గరిష్ట ధరలు నమోదు కాగ, ఎర్రగా ఉన్న ఉల్లికి కనిష్ట ధరలు పలికాయి.

జోరుగా వేలం పాట..

మార్కెట్‌కు రైతులు పెద్ద ఎత్తున ఉల్లిని అమ్మకానికి తేవడంతో మార్కెట్ వ్యాపారులతో పాటు ఇతర ప్రాంతాల వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. క్వింటాల్ ధర గరిష్టంగా రూ.2,100, కనిష్టంగా రూ.1,060 వరకు నమోదయ్యాయి. తూకాల అనంతరం 45 కేజీల ఉల్లి బస్తా గరిష్టంగా రూ.1,050, తక్కువగా రూ.550 వరకు విక్రయించారు. మార్కెట్‌లో జోరుగా లావాదేవీలు సాగాయి.

కందుల ధర రూ.8,951..

మార్కెట్‌లో బుధవారం టెండర్లలో కందుల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.8,951, కనిష్టంగా రూ.8,851 ధరలు లభించాయి. ఆముదాల ధర గరిష్టంగా రూ.5,349 ఒకే ధర వచ్చింది.



టీడీపీ కకావికలం

తమ్ముళ్ల హాహాకారాలు.. పలు నియోజకవర్గాల్లో అభ్యర్థుల కరువు

ఎంపీ కేశినేని నాని బాటలోనే టీడీపీకి గుడ్‌బై చెబుతున్న నేతలు

- దబ్బు మూటలే అర్హతగా సమన్వయకర్తల నియామకం
- మరోవైపు టీడీపీ–జనసేన మధ్య పొత్తు కుంపట్లు.. అనేక నియోజకవర్గాల్లో కుదరని సయోధ్య
- ఘోర పరాజయం తప్పదని పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం



టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడి రాజకీయం అంతా నాటి నుంచి నేటి వరకు డబ్బుతోనే ముడిపడి సాగుతోంది. అభ్యర్థులను డబ్బు మూటలతో తూకం వేస్తుండటం ఆ పార్టీ సీనియర్ నేతలను నివ్వెర పరుస్తోంది. ఒక్క చోట కూడా గెలవని జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను పక్కన పెట్టుకుని అడుగులు ముందుకు వేస్తుండటం పట్ల అత్యధిక నియోజకవర్గాల్లో నేతల నుంచి విముఖత వ్యక్తమవుతోంది. దీనికి తోడు మాలోకం లోకేష్ తీరు కలవర పెడుతోంది. ఇప్పటికే కొందరు నేతలు ఆ పార్టీని వీడటం.. త్వరలో గుడ్‌బై చెప్పేందుకు పెద్ద సంఖ్యలో నేతలు సిద్ధపడుతుండటం బాబును ఆందోళనకు గురిచేస్తోంది. నష్ట నివారణ కోసం మధ్యవర్తులను రంగంలోకి దింపినా ఫలితం కనిపించక తండ్రీ కొడుకులు తల పట్టుకున్నారు.

సాక్షి, అమరావతి : టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాలకు సమన్వయకర్తల ఎంపికకు డబ్బు మూటలనే ప్రధాన అర్హతగా నిర్ణయించడం ఆ పార్టీలో సీనియర్ నేతలను కలవరపరుస్తోంది. ఆది నుంచి టీడీపీని నమ్ముకున్న వారిని కాదని.. డబ్బు మూటలను చూపుతున్న వారినే సమన్వయకర్తలుగా నియమిస్తుండటంతో సీనియర్ నేతలు ఆ పార్టీని వీడుతున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని బుధవారం ఆ పార్టీని వీడారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌తో సమావేశమయ్యారు. సీఎం వైఎస్ జగన్‌తో కలిసి పని చేస్తానని ప్రకటించారు. ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గంలో రూ.20 కోట్లు డిపాజిట్ చేసిన వారికే టికెట్ ఇస్తానంటూ చంద్రబాబు తెగేసి చెప్పడంతో మాజీ మంత్రి పీతల సుజాత ఆందోళన చెందుతున్నారు. నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలో తనను కాదని పక్కన పెట్టి.. కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని నియమించాలని చంద్రబాబు ఆలోచిస్తుండటంతో ఆ నియోజకవర్గ సమన్వయకర్త ధర్మవరం సుబ్బారెడ్డి గందరగోళంలో పడ్డారు. డబ్బు మూటలే ప్రాతిపదికగా సమన్వయకర్తలను చంద్రబాబు మార్చేస్తుండటం.. కేశినేని నాని బాటలోనే సీనియర్ నేతలు ఒకరి వెంట ఒకరు పార్టీని వీడుతుండటంతో 'దేశం'కకావికలమవుతోంది. ఎన్నికల షెడ్యూలు వెలువడడానికి ముందే పార్టీ బలహీనంగా మారడంతో తెలుగు తమ్ముళ్లలో హాహాకారాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమాభివృద్ధి పథకాలు, విప్లవాత్మక సంస్కరణలతో సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో రోజురోజుకు మద్దతు పెరుగుతుండటంతో ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసేందుకు అత్యధిక నియోజకవర్గాల్లో అభ్యర్థులు ముందుకు రావడం లేదు. దాంతో ఎన్నికల్లో ఉనికి చాటుకోవడం కోసం జనసేనతో పొత్తుకు చంద్రబాబు పాకులాడారు. కానీ.. క్షేత్ర స్థాయిలో టీడీపీ, జనసేన నేతల మధ్య సఖ్యత కుదరక పోవడంతో పొత్తు కుంపట్లను రాజేస్తోంది. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన నేత కందుల దుర్గేష్.. తెనాలిలో జనసేన నేత నాదేండ్ల మనోహర్, టీడీపీ సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ల మధ్య విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. టీడీపీ బలహీనంగా మారడం.. టీడీపీ–జనసేన పొత్తు కుంపట్లను రాజేస్తుండటంతో 2019 ఎన్నికల కంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీ–జనసేన కూటమికి ఘోర పరాజయం తప్పదనే భావన ఆ పార్టీ శ్రేణుల్లోనే వ్యక్తమవుతోంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పనికిరాని వ్యక్తి.. పచ్చి మోసగాడు

చంద్రబాబుపై ఎంపీ కేశినేని నాని ధ్వజం

- తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిసిన కేశినేని
- రాజీనామా స్పీకర్ ఆమోదం పొందగానే వైఎస్సార్ సీపీలో చేరతానని ప్రకటన



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ కేశినేని నాని

సాక్షి, అమరావతి: "చంద్రబాబు పచ్చి మోసగాడు.. ఈ రాష్ట్రానికి పనికిరాని వ్యక్తి అని తెలిసి కూడా విజయవాడపై ప్రేమ, నియోజకవర్గం కోసమే టీడీపీలో ఇంతకాలం ఉన్నా.." అని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) వ్యాఖ్యానించారు. టీడీపీలో ఎన్నో అవమానాలను ఓర్చుకున్నానని, ఇక భరించలేక బయటికి వచ్చేయాలని నిర్ణయించున్నట్లు తెలిపారు. 'ముఖ్యమంత్రి జగన్ పేదల పక్షపాతి. ఆయన విధానాలు నాకు నచ్చాయి. సీఎం జగన్ వెనుక నడవాలని నిర్ణయించుకున్నా. పార్టీ కోసం ఆయన ఏం చేయమంటే అది చేస్తా..'అని పేర్కొన్నారు. తాను నైతిక విలువలు పాటించే వ్యక్తినని, టీడీపీకి రాజీనామాతో పాటు ఎంపీ పదవికి రాజీనామాను స్పీకర్ ఫార్మాట్‌లో పంపుతానన్నారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరతానని తెలిపారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌ను కలసిన అనంతరం ఎంపీ కేశినేని నాని మీడియాతో మాట్లాడారు. సీఎంను మర్యాద పూర్వకంగానే కలిశానని చెప్పారు.

నాతో నెల జీతాలు ఇప్పించారు..

పేదలకు అండగా ఉన్న సీఎం జగన్ వెంట నడవాలని నిర్ణయించున్నట్లు ఎంపీ కేశినేని నాని వెల్లడించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడితో ప్రెస్‌మీట్ పెట్టించి తనను దూషించారని, చెప్పు తీసుకొని కొడతానని ఓ క్యారెక్టర్‌లెస్ వ్యక్తి తిట్టినా పార్టీ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనను గొట్టంగాడు అని దారుణంగా అవమానించినా భరించానన్నారు. 'చంద్రబాబు నన్ను ఎన్నో సార్లు అవమానించారు. టీడీపీ గెలిచేది లేదని చాలా మంది నాకు చెప్పారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో పార్టీని నా భుజస్కంధాలపై నడిపించా. పార్టీ కోసం నా సొంత వ్యాపారాలను పక్కనపెట్టా. వ్యాపారాల కంటే పార్టీ ముఖ్యమని పని చేశా. టీడీపీ కోసం ఆస్తులు అమ్ముకున్నా. వ్యాపారాలు సైతం వదులుకున్నా. చంద్రబాబు పాదయాత్ర, స్థానిక సంస్థల ఎన్నికలను నా భుజాలపై మోశా. పార్టీ కోసం, ప్రజల కోసం నిజాయితీగా కష్టపడ్డా. కొందరికి నెలవారీ జీతాలు ఇవ్వమని చంద్రబాబు చెబితే డబ్బులు ఖర్చు పెట్టా. తొమ్మిదేళ్లుగా పార్టీలో ఉంటే నేను చేసిన తప్పేమిటో కనీసం చెప్పాలి కదా?'అని ఎంపీ కేశినేని పేర్కొన్నారు.

బొండా భార్యను నిలబెడితే ప్రమాదం..

'విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల్లో బొండా ఉమ భార్యను నిలబెడితే చాలా ప్రమాదం. నీ కుమార్తెను పోటీ చేయించు అని చంద్రబాబు నాతో అన్నారు. విజయవాడ మేయర్ అభ్యర్థిగా శ్వేతను చంద్రబాబే నిర్ణయించారు. ఆయన మూడు రోజులు అడిగితేనే ముందుకొచ్చాం. ఆ తర్వాత ప్రెస్‌మీట్ పెట్టించి చంద్రబాబు నన్ను తిట్టించారు. సొంత పార్టీ నేతలే అవమానించినా చర్యలు తీసుకోలేదు. నన్ను చాలా రకాలుగా అవమానించారు. టీడీపీలో ఉంటూ ఇంకా ఎన్ని భరించాలి? ఇష్టం లేకపోతే వెళ్లిపోతానని అందరి సమక్షంలోనే చంద్రబాబుతో చెప్పా. నువ్వు ఉండాల్సిందే అని చంద్రబాబు నాతో అన్నారు. టీడీపీ కోసం సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని చాలా మంది హితవు చెప్పినా వినకుండా పార్టీలో కొనసాగా'అని కేశినేని ఆవేదన వ్యక్తం చేశారు.

లోకేష్.. ఆఫ్ట్రాల్

'టీడీపీ కోసం నేను అమ్ముకున్న ఆస్తుల విలువ రూ.2 వేల కోట్లు ఉంటుంది. చివరకు నా కుటుంబంలో చిచ్చు పెట్టారు. నా కుటుంబ సభ్యులతో, రౌడీలతో కొట్టించాలని లోకేష్ ఎందుకు ప్రయత్నించారు? లోకేష్ అనే వ్యక్తి ఆఫ్ట్రాల్..! చంద్రబాబు కుమారుడిగా మినహాయిస్తే ఆయనకు ఎలాంటి అర్హతా లేదు. అతడికి పార్టీ అన్నీ ఇచ్చినా ఓడిపోయాడు. నేను నా సొంత వనరులతో గెలిచా. అలాంటిది అతడి వద్ద మోకరిల్లాలంటే సాధ్యం కాదు'అని కేశినేని స్పష్టం చేశారు.

సీఎం కార్యక్రమాలకు హాజరు కానివ్వలేదు

'చంద్రబాబు పచ్చి మోసగాడని ప్రపంచానికి తెలుసు. ఇంత దగా చేస్తాడనుకోలేదు. ప్రొటోకాల్ ప్రకారం ఎంపీగా ముఖ్యమంత్రి కార్యక్రమాలకు నేను హాజరు కావాలి. కానీ సీఎం కార్యక్రమాలకు చంద్రబాబు నన్ను హాజరు కానివ్వలేదు. చంద్రబాబు ఏపీకి పనికి రాని వ్యక్తి. టీడీపీకి, ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని ఇప్పటికే ప్రకటించా. నా రాజీనామా ఆమోదం పొందగానే వైఎస్సార్‌సీపీలో చేరుతా'అని ఎంపీ కేశినేని చెప్పారు.

బెజవాడ, గుంటూరు నిజం.. అమరావతి ఓ కల

'నాకు విజయవాడ అంటే ప్రాణం. బెజవాడ కోసం ఏమైనా చేస్తా. అధికారంలో ఉండగా విజయవాడ కోసం చంద్రబాబు రూ.100 కోట్లైనా ఇచ్చాడా? కానీ విజయవాడ కోసం నేను ఎంతో చేశా. షాజహాన్ తాజ్‌మహల్ కడితే నేను అమరావతి కడతానంటూ చంద్రబాబు గొప్పలు చెప్పారు. విజయవాడ, గుంటూరు మాత్రమే నిజం.. అమరావతి ఒక కలే. అది భ్రమరావతి. అక్కడంతా రియల్ ఎస్టేట్. నేను చంద్రబాబును ఎప్పుడూ టికెట్ అడగలేదు. సీఎం జగన్‌ను కూడా అడగను. సీఎం జగన్‌తో ప్రయాణం చేయాలనుకుంటున్నా. ఎన్టీఆర్ జిల్లాలో టీడీపీ 60 శాతం ఖాళీ అవబోతుందని ఆయన చెప్పారు'అని కేశినేని నాని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

19 నుంచి కుల ఆధారిత సామాజిక, ఆర్థిక సర్వే

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈ నెల 19వ తేదీ నుంచి కుల ఆధారిత సామాజిక, ఆర్థిక స్థితిగతుల సర్వే నిర్వహించాలని రాష్ట్ర ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.గిరిజాశంకర్ బుధవారం కలెక్టర్లకు ఉత్తర్వులు జారీచేశారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఈ నెల 19వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలని సూచించారు. సర్వేని పదిరోజుల్లో.. ఈ నెల 28వ తేదీకి పూర్తిచేయాలని నిర్దేశించారు. సర్వేకు సంబంధించి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి ఈ నెల 11వ తేదీలోగా శిక్షణ పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీలోగా సర్వే సిబ్బందిని, పర్యవేక్షణ సిబ్బందిని మ్యాపింగ్ చేయాలని, 17వ తేదీలోగా పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వాలని సూచించారు.

షరతులతో చంద్రబాబుకు ముందస్తు బెయిల్

ఇన్నర్ రింగ్ రోడ్డు, ఉచిత ఇసుక, మద్యం కేసుల్లో మంజూరు చేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్ భూ కుంభకోణం, ఉచిత ఇసుక, మద్యం విధానాల్లో అక్రమాలపై సీఐడీ నమోదు చేసిన కేసుల్లో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అలాగే మద్యం కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ అప్పటి కమిషనర్ శ్రీ నరేష్‌లకు కూడా ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఈ సందర్భంగా హైకోర్టు పలు షరతులు విధించింది. ఇప్పటి నుంచి వారంలోపు దర్యాప్తు అధికారి ముందు లొంగిపోవాలని చంద్రబాబు, రవీంద్ర, శ్రీ నరేష్‌లను హైకోర్టు ఆదేశించింది. రూ.లక్షకు రెండు వ్యక్తిగత పూచీకత్తులు సమర్పించాలంది. ముందస్తు బెయిల్‌పై విడుదలైన తరువాత ఎప్పుడు పిలిస్తే అప్పుడు దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని చంద్రబాబు తదితరులను ఆదేశించింది. అయితే 48 గంటల ముందు నోటీసు ఇవ్వాలని దర్యాప్తు అధికారికి స్పష్టం చేసింది. దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించింది. ఈ కేసుల గురించి తెలిసిన వ్యక్తిని.. ఆ కేసుల వాస్తవాలను కోర్టుకు గానీ, పోలీసులకు గానీ చెప్పకుండా బెదిరించడం గానీ, ప్రలోభపెట్టడం గానీ, వాగ్దానాలు చేయడం గానీ ఎంత మాత్రం చేయడానికి వీల్లేదంది. ఈ కేసులకు సంబంధించి ఎలాంటి బహిరంగ ప్రకటనలు చేయడానికి వీల్లేదని చంద్రబాబు తదితరులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం తీర్పులు వెలువరించారు.

నేటి నుంచి విధుల్లోకి మున్సిపల్ కార్మికులు

కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు సఫలం

సాక్షి, అమరావతి: పురపాలక సంఘాలు, కార్పొరేషన్ల పరిధిలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు గురువారం నుంచి విధుల్లో చేరేందుకు అంగీకరించారు. బుధవారం సచివాలయంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు కార్మిక సంఘాల నేతలతో సమావేశమయ్యారు. సీవరేజీ మరణాలకు సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా రూ.30 లక్షలు పరిహారం చెల్లింపు, సరండర్ లీవ్ బిల్లులు విడుదల, రెగ్యులర్ కార్మికులకు పీఎఫ్ అకౌంట్ చెల్లింపు, పారిశుద్ధ్య కార్మికులు కానివారి కేటగిరీల మార్పు విషయంలో ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలపై సత్వరమే చర్యలు తీసుకుంటామని గతంలోనే మంత్రుల బృందం హామీ ఇచ్చింది. అలాగే గతంలో చనిపోయిన కుటుంబాలకు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంపును కూడా అంగీకరించింది. ప్రభుత్వ హామీలకు కార్మిక సంఘాలు ఆమోదం తెలిపాయని, గురువారం సాయంత్రానికి మినిట్స్ ఇస్తామని మంత్రి బొత్స ప్రకటించారు. చర్చలు సానుకూలంగా జరిగాయని, సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు తెలిపారు. గురువారం నుంచి కార్మికులు విధుల్లోకి వస్తారన్నారు. జీవో వచ్చాక సమ్మెను విరమిస్తామన్నారు.

జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



మోహన్, స్వప్న

మక్తల్: జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు క్రీడాకారులు ఎంపికైనట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం బుధవారం తెలిపారు. గత నెల 30, 31న మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో నిర్వహించిన పోటీల్లో మక్తల్ మండలం గుర్లపల్లికి చెందిన ఆర్.స్వప్న, మోహన్ తమ ప్రతిభను చాటారు. వీరు ములుగు జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. అక్కాతమ్ముడు స్వప్న, మోహన్ ఈ నెల 12 నుంచి ఏపీ రాష్ట్రం విజయవాడలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

జాతీయ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు



మోహన్



కిరణ్‌కుమార్



పవీణ్‌నాయక్



కోచ్ సాధిక్ అలీ

మహబూబ్‌నగర్ క్రీడలు: జనగామలో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు జరిగే జాతీయ సీనియర్ సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎం.మోహన్, జె.కిరణ్‌కుమార్, ఆర్.ప్రవీణ్ నాయక్‌లు తెలంగాణ జట్టులో చోటు దక్కించుకున్నారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్టుకు కోచ్‌గా సాధిక్ అలీ నియమితులయ్యారు. క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాలని జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం ప్రతినిధులు కోరారు.

నిలకడగా నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం 1,020 అడుగులకు నీటిమట్టం కొనసాగుతుంది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.

రన్నరప్‌గా నిలిచిన మహబూబ్‌నగర్

- ముగిసిన రాష్ట్రస్థాయి విద్యుత్ ఉద్యోగుల క్రీడాపోటీలు
- రాష్ట్రస్థాయి వాలీబాల్ చాంపియన్ ఖమ్మం



రన్నరప్‌గా మహబూబ్‌నగర్ ఆపరేషన్స్ జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో రాష్ట్రస్థాయి విద్యుత్ ఉద్యోగుల (తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కం) క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. వాలీబాల్ టోర్నీలో వివిధ జిల్లాలకు చెందిన 13 జట్లు పాల్గొన్నాయి.

వాలీబాల్ చాంపియన్ ఖమ్మం..

ఖమ్మం ఆపరేషన్స్ వర్సెస్ మహబూబ్‌నగర్ ఆపరేషన్స్ జట్ల మధ్య వాలీబాల్ ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఉత్కంఠంగా కొనసాగిన మ్యాచ్‌లో ఖమ్మం ఆపరేషన్స్ జట్టు 25–21, 25–18 సెట్ల తేడాతో మహబూబ్‌నగర్ ఆపరేషన్స్ జట్టుపై విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. మూడోస్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ సౌత్ జట్టు 21–19, 23–18 నల్లగొండ ఆపరేషన్ జట్టుపై గెలుపొందింది.

విజేతలకు ట్రోఫీలు అందజేత..

విన్నర్, రన్నరప్, మూడోస్థానం జట్లకు జిల్లా విద్యుత్‌శాఖ అధికారి ఎస్.శ్రీరాంమూర్తి ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని అన్నారు. ఒత్తిడిలో ఉండే విద్యుత్ ఉద్యోగులకు ఇలాంటి క్రీడాపోటీలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని తెలిపారు. ఉద్యోగులు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, డీఈలు చంద్రమౌళి, వెంకటశివరాం, కృష్ణమూర్తి, ప్రసాదరావు, మోహనకృష్ణ, బాషా, విద్యుత్ సంస్థల క్రీడల అధికారి జగన్నాథ్, క్రీడల నిర్వాహకులు హబీబుద్దీన్ షకీల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మైసమ్మ ఉత్సవాలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నవాబుపేట: మండలంలోని మైసమ్మ ఉత్సవాలు బుధవారం మహా మంగళహారతితో ముగిసినట్లు ఆలయ చైర్మన్ కృష్ణయ్య, దేవాలయ అధికారి మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు. చివరి రోజు ఉత్సవాలకు సంబంధించి హుండీని లెక్కించారు. హుండీలో 35 తులాల వెండి ఆభరణాలు, రూ.1,28,385 నగదు వచ్చినట్లు అధికారి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, సర్పంచ్ జంగమ్మ, గోపాల్, వెంకట్‌రెడ్డి, బాలయ్య, రాజు, శ్రీనివాస్‌గుప్త, ఖాజా, మాధవులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయం అవసరం లేదా?

- రిజర్వాయర్ నిర్మాణంపై ఏకపక్ష నిర్ణయాలతో ప్రమాదం
- రద్దు చేయాలని తహసీల్దార్‌కు రైతుల వినతి



రిజర్వాయర్ నిర్మాణ అనుమతులు రద్దుచేయాలని ఆర్‌ఐకి వినతి అందజేస్తున్న రైతులు

బల్మూర్: తమ భూములు ముంపునకు గురికావడంతో పాటు నాలుగు గ్రామాల ఉనికికే ప్రమాదంగా ఉన్న ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మాణం పనులను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు సీతారాంరెడ్డి, వెంకటస్వామి మాట్లాడారు. ఉమామమహేశ్వర రిజర్వాయర్ నిర్మాణం కోసం సర్వే చేసే సమయంలో రైతులకు ఎలాంటి సమాచారం లేకపోగా, కనీస పారదర్శకత పాటించకుండా గుట్టుగా వ్యవహరించారని మండిపడ్డారు. ఈ రిజర్వాయర్ నిర్మాణంతో బల్మూర్, అనంతవరం, మైలారం, అంబగిరి నాలుగు గ్రామాలకు చెందిన రైతుల భూములు 2,500 ఎకరాలతో పాటు గ్రామాల్లో ఇల్లు కూడా నీట మునుగనున్నాయని వాపోయారు. రైతులకు, ఇక్కడి ప్రజలకు ఎలాంటి సమాచారం, నోటీసులు అందించకుండా చేపట్టే ఈ రిజర్వాయర్ నిర్మాణం జరిగితే నాలుగు గ్రామాల్లో 95 శాతం మంది నిర్వాసితులై రోడ్డున పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రిజర్వాయర్ నిర్మాణంతో బల్మూర్ మండలంలోని ఏ ఒక్క గ్రామంలో ఎకరా పొలానికి కూడా నీరు పారే అవకాశం లేదని, ఇతర ప్రాంతాలకు లబ్ధి చేకూరే రిజర్వాయర్‌ను వెంటనే ప్రభుత్వం రద్దు చేసి కాల్వల ద్వారా రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. రిజర్వాయర్ రద్దు కోరుతూ గురువారం నుంచి ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై ప్రభుత్వం సీబీఐ విచారణ కోరాలి

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



అయ్యప్ప స్వామిని దర్శించుకుంటున్న డీకే అరుణ

జడ్చర్ల: కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం సీబీఐ విచారణ కోరాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం జుడీషియల్ విచారణకు ఆదేశించడం కేవలం కాలయాపన మాత్రమేనని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సీబీఐ విచారణకు ఎందుకు వెనుకాడుతుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అవినీతి, అక్రమాలపై పూర్తి స్థాయిలో సీబీఐ విచారణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌పై వ్యతిరేకతతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య ప్రధాన పోటీ ఉంటుందన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో ఏ పార్టీకి ఓటు వేసినా పార్లమెంట్ ఎన్నికలలో మాత్రం బీజేపీకే వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ గెలిచినా పార్లమెంట్‌లో ఒరగబెట్టిందేమి లేదన్నారు. కార్యక్రమంలో సాహితీ, రంజిత్‌బాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ఆపబోం

- మాజీ మంత్రి అవినీతి, అక్రమాలపై విచారణ
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అభివృద్ధి పనులను ఆపబోమని, గత పదేళ్లలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేసిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపిస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కొత్తగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, బస్టాండుకు మధ్య స్థలాన్ని ఎవరెవరికి లీజుకు ఇచ్చారో ప్రజలకు చెప్పాలన్నారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో నిధులు మంజూరు కాకుండానే శాసనసభ ఎన్నికలకు ముందు హడావుడిగా వివిధ పనులకు శిలాఫలకాలు వేయడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ కవిత చేసిన అవివేక, అనాలోచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. తామెవరమూ బీఆర్ఎస్ కౌన్సిలర్లను కొనుగోలు చేయడం లేదన్నారు. గత నాలుగేళ్లుగా ఏ అభివృద్ధి పనులు కాక వారు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఇప్పుడు కౌన్సిల్‌లోని మెజారిటీ సభ్యులు ఆత్మగౌరవంతో పాటు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉన్నామని భావిస్తున్నారన్నారు. ఏకంగా 32 మంది ఇటీవల కలెక్టర్‌ను కలిసి చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చారన్నారు. వారిని చేర్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీపరంగా ఎలాంటి చర్చ జరగలేదన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్పీ వెంకటేశ్, ఎం.సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల శాసనసభ ఎన్నికల్లో ప్రజలు సరైన తీర్పును ఇచ్చారన్నారు. మాజీ మంత్రి ఓడిపోయి 35 రోజులైనా ఇంకా రియలైజేషన్ కాలేదని, ఎక్కడైనా మెడికేషన్‌కు వెళితే బాగుంటుందని ఎద్దేవా చేశారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌సిద్దీఖి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రాధాఅమర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆలకు పలువురి పరామర్శ



నివాళి అర్పిస్తున్న వేముల ప్రశాంత్‌రెడ్డి

భూత్పూర్: అన్నాసాగర్‌లో బుధవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. ఈ నెల 4న మాజీ ఎమ్మెల్యే సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డి గుండెపోటుతో మృతిచెందాడు. ఆల వర్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నివాళి అర్పించారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, జిల్లాకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని పరామర్శించారు.